క్లుప్తంగా

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

కలికిరి: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన బుధవారం సాయంత్రం కలికిరి పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని మేడికుర్తి గ్రామం సన్యాసివారిపల్లికి చెందిన ఎస్.ఎహసాన్ తన ద్విచక్రవాహనంలో కలికిరి వైపు నుంచి కొత్తగజ్జలవారిపల్లి సమీపంలోని పెట్రోల్ బంకు వద్దకు వెళుతున్నాడు. మార్గంమధ్యలో పాళెంకురవపల్లి బస్టాప్ సమీపంలో కలికిరి వైపు నుంచే పల్లవోలు గ్రామం ద్వారకనగర్‌కు ద్విచక్రవాహనంలో వెళుతున్న టి.వెంకటేశ్వరను వెనుకవైపు నుంచి ఢీకొన్నాడు. ప్రమాదంలో ఎస్.ఎహసాన్ తలకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. వెంకటేశ్వరకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనంకు సమాచారమిచ్చి కలికిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

పెద్దమండ్యం: మండలంలోని అవికేనాయక్ తండా పంచాయతీ షేకేనాయక్‌తండాలో తాగునీటి సమస్య పరిష్కరించాలని గిరిజనులు కోరుతున్నారు. తండాలో ఉన్న తాగునీటి మోటారు మరమ్మతులకు గురి కావడంతో వారం రోజులుగా ఇబ్బందులు పడుతున్నట్లు మహిళలు తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రజాప్రతినిధులను, అధికారులను కోరినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కోసం సమీపంలోని వ్యవసాయబోర్లను ఆశ్రయిస్తున్నామని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

సింగిల్ విండో మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి మృతికి సంతాపం


ప్రతాప్‌రెడ్డి (ఫైల్)

బి.కొత్తకోట: వైఎస్సార్‌సీపీ నాయకుడు, గట్టుకు చెందిన సింగిల్‌విండో మాజీ చైర్మన్ సుబ్బిరెడ్డిగారి ప్రతాప్‌రెడ్డి (80) బుధవారం మృతి చెందాడు. ఉమ్మడి చిత్తూరు జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. 2012లో వైఎస్సార్‌సీపీలో చేరి కొనసాగుతున్నారు. ప్రతాప్‌రెడ్డి గ్రామ పరిపాలన అధికారిగా కూడా పనిచేశారు. ప్రతాప్‌రెడ్డి మృతికి ఎంపీ పీవీ.మిధున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డి సంతాపం తెలిపారు. గురువారం గట్టులో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు

నందలూరు(రాజంపేట) : నాగిరెడ్డిపల్లె అర్బన్ ప్రాంతంలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టామని నాగిరెడ్డిపల్లె అర్బన్ సర్పంచ్ జంబు సూర్యనారాయణ అన్నారు. బుధవారం నారాయణరాజుపేట జగనన్న కాలనీలో రూ.10లక్షలతో కొత్త బోర్లు వేయనున్నట్ట చెప్పారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డిల చొరవతో నవరత్నాలలో భాగంగా పేదలందరికి ఇళ్ల పథకంలో రూ.10లక్షల మంజూరు చేశారన్నారు. విద్యుత్‌లైన్ల పనులు త్వరలో పూర్తవుతాయన్నారు. ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకేపాటి రమేష్‌రెడ్డి, మట్టిబాబు, శిరసాల నాగేంద్ర, తుమ్మల శివ, పొంబల శివ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, నిర్వాహకులు

వీరబల్లి : మండల పరిధిలోని సోమవరం గ్రామం పుత్తావాండ్లపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కుళ్లాయి రెడ్డి కుమారుడు శ్రీనివాసులరెడ్డి, కుటుంబ సభ్యులు బుధవారం ఉగాది పురస్కరించుకొని పేదలకు 1500 చీరలు పంపిణీ చేశారు. తమ గ్రామ పరిధిలోని పేదలకు ఏడాదికి ఒకసారి తమవంతు ఎంతో కొంత సహాయం చేస్తుంటామన్నారు. ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి చేతులు మీదుగా చీరలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వీరనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీకార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

రాజంపేట రూరల్ : వేసవిని దృష్టిలో ఉంచుకొని వైఎస్సార్‌సీపీ నియోజవర్గ మహిళా కార్యదర్శి మిరియాల సురేఖ ఉచిత చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పట్టణంలోని మన్నూరులో బుధవారం ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రంను వైఎస్సార్‌సీపీ నాయకుడు డీలర్ సుబ్బరామిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఉచిత చలివేంద్రం ఏర్పాటు చేయటం శుభపరిణామని రాష్ట్ర ఆర్టీసీ డైరెక్టర్ జి.గుల్జార్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.శేఖర్‌రెడ్డి, ఓ.సునీల్‌కుమార్, కె.అమరనాథరెడ్డి, ఎస్.మసూద్ అలిఖాన్, ఎం.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శోభకృత్‌నామ వేడుకలు

- ఆలయాల్లో పంచాగశ్రవణం
- ఉగాదికి ప్రత్యేక పూజలు


ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో పంచాగం వింటున్న భక్తులు


గుర్రంకొండ: తరిగొండ ఆలయంలో పంచాంగ శ్రవణ కావిస్తున్న అర్చకులు

మదనపల్లె సిటీ: శ్రీశోభాకృత్‌నామ సంవత్సర ఉగాది వేడుకలను భక్తిశ్రద్ధలతో ప్రజలు జరుపుకున్నారు. మదనపల్లె పట్టణంలో బుధవారం ఆలయాల్లో పంచాగశ్రవణం నిర్వహించారు. స్థానిక కోటవీధిలోని శ్రీ షిర్డిసాయిబాబా ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు సాయిచక్రవర్తిస్వామి పంచాగశ్రవణం భక్తులకు వినిపించారు. ఏపే రాశుల వారికి నూతన ఏడాది రాశి ఫలితాలను తెలియజేశారు. ఈ ఏడాది అధిపతి బుధుడు కావడంతో పంటలు బాగా పండుతాయని, సకాలంలో వర్షాలు కురిసి రైతులు సుఖసంతోషాలతో ఉంటారన్నారు. రాజ్యపాలన బాగుటుందన్నారు. ఆరోగ్య విషయాల్లో జాగ్రత్తలు అవసరమన్నారు.పత్రికారంగంకు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. అకాల వర్షాలు కురుస్తాయన్నారు. ఏడాదంతా శుభాలు కలుగుతాయన్నారు. ముఖ్యంగా బ్రాహ్మణులకు గోధుమలు దానం చేయడం ఎంతో శ్రేష్ఠమన్నారు. అనంతరం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధన్‌భట్టార్, వేదపండితులు బాలాజీలు పంచాగశ్రవణం నిర్వహించారు. ఆయా రాశులవారీగా ఫలితాలు వివరించారు.నూతన సంవత్సంలో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థనలు చేశారు.

పితృదేవతలకు పూజలు

ఉగాది పండుగ పురస్కరించుకుని ఇళ్లలో పిండి వంటకాలు చేశారు. ఉగాది పచ్చడి చేసి అందరికి పంచిపెట్టారు. పితృదేవతలకు నూతన బట్టలు పెట్టి పూజలు చేశారు. సమాధుల వద్దకు వెళ్లి పూర్వీకుల ఆత్మశాంతి కోసం పూజలు చేశారు.

గుర్రంకొండలో..

గుర్రంకొండ: మండలంలోని పలుగ్రామాల్లో ఉగాది పండుగ వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకొన్నారు. బుధవారం శోభకృతనామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకొని మండలంలోని తరిగొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వేకువజామునే స్వామివారికి అభిషేకాలు నిర్వహించి, పంచాంగ శ్రవణం కావించారు. అనంతరం రంగురంగుల పుష్పాలతో అలంకరించిన స్వామివారి వాహనంపై స్వామివార్లను కొలువుదీర్చి మేళతాళాలతో గ్రామపురవీధుల గుండా తిరుచ్చి(గ్రామోత్సవం) వైభవంగా నిర్వహించారు. మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయంలో పండురోజును పురస్కరించుకొని పంచాంగ శ్రవణం నిర్వహించారు. పలువురు ఆలయఅర్చకులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి రుద్రాభిషేకం, సహస్ర నామాచర్చనతో విశేష పూజలు చేశారు. గుర్రంకొండలో గ్రామదేవత శ్రీ గంగమ్మతల్లిని రంగరంగ వైభవంగా గ్రామపురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.

పెద్దతిప్పసముద్రం: శోభాకృత్‌నామ సంవత్సరాది సందర్భంగా బుధవారం మండలంలోని ప్రజలు ఉగాది పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దూర ప్రాంతాల్లో ఉంటున్న వారంతా స్వగ్రామాలకు వచ్చి కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపారు. సంప్రదాయ దుస్తులతో ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు.

ఆలయాల్లో ఉగాది వేడుకలు

బి.కొత్తకోట: ఉగాది సందర్భంగా స్థానిక ఆలయాల్లో వేడుకలను జరిపారు. ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఉదయం నుంచే ఆలయాలకు వచ్చి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించగా సాయంత్రం అర్చకులు పంచాగం వినిపించారు.

రామసముద్రం: మండలంలోని తెలుగు సంవత్సరాది ఉగాదిని పురస్కరించుకుని బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఉదయం ప్రజలు అభ్యంగా స్నానం చేసి నూతన వస్త్రాలు ధరించి ఆలయాలకు వెళ్లి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే వేదపండితులు పంచాంగ శ్రావణం చేశారు. ఆలయాల్లో ఇచ్చిన ఉగాధి పచ్చడి తీసుకున్నారు. బంధుమిత్రులతో గ్రామాలు కళకళలాడాయి. ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా ఉగాది సంబరాలు

పీలేరు : శోభకృత్ నామ సంవత్సర ఉగాది సంబరాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం కొత్త దుస్తులు ధరించి ఉగాది పచ్చడి పంచుకుని సంబరాలు చేసుకున్నారు. పీలేరు ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య కల్యాణమండపం నుంచి పట్టణంలో కవాతు నిర్వహించారు. తెలుగు బాషా సమితి అధ్యక్షుడు మురళీధర్‌రాజు ఆధ్వర్యంలో నూతన పంచాంగం పఠనం గావించారు.

ఉత్సాహంగా శోభకృత్ వేడుకలు

వాల్మీకిపురం: మండల వ్యాప్తంగా ఉగాది పర్వదినాన్ని షడ్రుచుల పచ్చడి ఆరగించి, కొత్త దుస్తులు ధరించి ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీ పట్టాభిరామాలయంలో ప్రత్యేక పూజల అనంతరం వేదపండితులతో పంచాంగశ్రవణ కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం తిరుమాడ వీధుల్లో స్వామివారిని ఊరేగించారు. అలాగే మండల వ్యాప్తంగా అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

కలికిరి: తెలుగు నూతన సంవత్సరాది తొలి తెలుగు పండుగ ఉగాది పర్వదినం సందర్భంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో సంబరాలు నిర్వహించారు. బుధవారం ఉదయం కలికిరి పట్టణంలో వెలసిన శ్రీ సోమేశ్వరాలయంలో అర్చకులు నూతన పంచాంగ శ్రవణం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.





తరిగొండలో లక్ష్మీ నరసింహస్వామి వారి తిరుచ్చి ఉత్సవం, రామసముద్రం: ప్రత్యేక అలంకారంలో శ్రీచౌడేశ్వరిదేవి ,వాల్మీకిపురం: పట్టాభిరామాలయంలో పూజలు, తిరుమాధ వీధుల్లో విహరిస్తున్న పట్టాభిరాముడు

జమాతే హింద్ ఉగాది శుభకాంక్షలు


వైద్యాధికారికి ఉగాది శుభాకాంక్షలు తెలుపుతున్న జమాతే-ఇస్లామీ-హింద్ సంస్థ వారు

గుర్రంకొండ: మండల కేంద్రమైన గుర్రంకొండలో జమాతే-ఇస్లామీ-హింద్ సంస్థ ఆధ్వర్యంలో పట్టణ ప్రముఖులకు ఉగాది పండుగ శుభకాంక్షలు తెలియజేస్తూ కార్డులు పంచిపెట్టారు. బుధవారం ఆ సంస్థ జిల్లా శాఖ అధ్యక్షుడు ఆజమ్‌ఆలీఖాన్ సభ్యులతో కలసి శోభకృత్‌నామ సంవత్సర ఉగాది శుభకాంక్షల గ్రీటింగ్ కార్డులను పంచిపెట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులకు తొలి పండుగ అయిన ఉగాది అందరికి మంచి తేవాలని, అందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

నిరుపేదలకు రంజాన్ కానుక



గాలివీడు : మహమ్మదీయ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం నిరుపేదలకు, వితంతువులకు, దివ్యాంగులకు దాదాపు 80 కుటుంబాలకు రంజాన్ కానుక పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదభూషన్ రెడ్డి, లక్కిరెడ్డిపల్లి సీఐ వరప్రసాద్, గాలివీడు మండల ఎస్ఐ బీవీ కుమార్‌లు మాట్లాడుతూ మానవతా దృక్పథంతో పేదవారికి నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో రైస్‌మిల్ తంగాళ వేణుగోపాల్, కూరగాయల సుబ్బారెడ్డి, మహమ్మదీయ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ ట్రస్టు, మస్జిదే తౌహీద్ గాలివీడు ప్రెసిడెంటు తాజుద్దీన్, వైస్ ప్రెసిడెంటు గౌస్ మొహిద్దీన్, సభ్యులు అహ్మద్, షర్షిల్ అహ్మద్, షబ్బీర్, అమీర్ బాషా, ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ ఏర్పాట్లు షురూ

–జామియా మసీదును పరిశీలించిన ఎమ్మెల్యే


జామియా మసీదు కమిటీ సభ్యులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె సిటీ: ముస్లిం సోదరులు పవిత్రంగా భావించే రంజాన్ మాసం రెండు రోజుల్లో ప్రారంభం కానుండటంతో మదనపల్లె పట్టణంలో పండుగ సందడి మొదలైంది. నెలవంక దర్శనంతో రంజాన్ పర్వదినాల ఉపవాసదీక్షలను ప్రారంభిస్తారు. నెల రోజుల పాటు పవిత్ర దీక్షలకు ప్రార్థనా స్థలాల్లో ఏర్పాట్లు మొదలయ్యాయి. తెల్లవారుజామున, సాయంత్రం, రాత్రి ప్రత్యేక ప్రార్థనలు మసీదు ఆవరణల్లో కొత్త తివాచీలు పరుస్తున్నారు. మసీదులకు మంచినీటి సరఫరా జరిగే ఏర్పాట్లు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. బెంగుళూరు బస్టాండు ప్రాంతంలో హలీం బట్టీలు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

జామియా మసీదును పరిశీలించిన ఎమ్మెల్యే

స్థానిక బెంగుళూరు బస్టాండులోని జామియా మసీదును ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా పరిశీలించారు. మసీదు కమిటీ సభ్యులతో చర్చించారు. ఉపవాసదీక్షపరులకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.

‘దిగజారుడు ప్రచారం చేస్తే ప్రజలే బుద్ధి చెబుతారు’

పెద్దమండ్యం: పెద్దమండ్యం మండలంలో కొన్ని పార్టీలకు చెందిన వారు తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి దౌర్జన్యం చేస్తున్నారని దిగజారుడు ప్రచారం చేస్తున్నారని, వారికి ప్రజలే బుద్ధి చెబుతారని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మొఘల్ చాంద్‌బాషా అన్నారు. మండలంలోని తరుకపల్లెలో బుధవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇటీవల ములకలచెరువులో జరిగిన ఒక సమావేశంలో వెలిగల్లుకు చెందిన బావాజాన్‌పై అక్రమ కేసులు బనాయించి దౌర్జన్యానికి పాల్పడినట్లు చేసిన ఆరోపణలపై టీడీపీ నాయకులకు సవాల్ విసిరారు. బావాజాన్‌పై గతంలోనే సారా విక్రయాలపై కేసు ఉన్నట్లు తెలిపారు. అలాగే కర్ణాటక మద్యం విక్రయిస్తూ పట్టుబడి పోలీసులు కేసు నమోదు చేస్తే ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం ఎంతమాత్రం సమంజసం కాదని అన్నారు. పేదరికంలో ఉన్న పార్టీ కార్యకర్తను పార్టీ తరపున ఆదుకోవడం పక్కన బెట్టి, ఇలాంటి మాటలు మాట్లాడించడం భావ్యం కాదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ములక బయ్యారెడ్డి, మాజీ సర్పంచ్ ములక సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మసీదుకు రూ. 2 లక్షలతో బోరు ఏర్పాటు


బోరు డ్రిల్లింగ్‌కు పూజలు చేస్తున్న సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా తదితరులు

పీలేరు రూరల్ : పట్టణంలోని సైనిక్ నగర్‌లో ఉన్న గుల్‌హసమత్ మసీదు, స్థానిక ప్రజల సౌకర్యార్థం రూ. 2 లక్షలతో బోరు మంజూరు చేసినట్లు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా తెలిపారు. బుధవారం బోరు డ్రిల్లింగ్‌కు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికులు, మైనారిటీల విన్నపం మేరకు ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహకారంతో బోరు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బోరు డ్రిల్లింగ్ చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లావణ్య, నరేష్, ఆనంద్, షాకీర్, ఉబేదుల్లా, దాదావలి, మహమ్మద్‌బాషా, మునీర్, అబీద్, యాసీన్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

జీవకోటికి జలమే ఆధారం



వాటర్ డే పోస్టర్ ఆవిష్కరణ

కురబలకోట: జీవరాశుల మనుగడకు గాలి తర్వాత జలం అత్యవసరమని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథన్ అన్నారు. బుధవారం వరల్డ్ వాటర్‌డేని కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవరాశులు బతకడానికి నీరు ముఖ్యమన్నారు. ఇది లేని చోట మనుగడ కష్టమన్నారు. నీరు లేని సమాజాన్ని ఊహించలేమన్నారు. ఆహారం లేకపోయినా కొద్ది రోజులు బతకవచ్చన్నారు. అదే నీరు లేకపోతే బతకడం కష్టమన్నారు. అందుకే నీటి ప్రాముఖ్యతను గుర్తించి దీని సంరక్షణకు పాటుపడాలన్నారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు


ప్రత్యంగిరి అలంకరణలో చౌడేశ్వరి అమ్మవారు


అమ్మవారికి దీలు,బోనాలు సమర్పిస్తున్న మహిళలు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలోని శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో జ్యోతి ఉత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. ఉత్సవాలు పురస్కరించుకుని ఆలయాన్ని రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలకరించారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. నీరుగట్టువారిపల్లె, కదిరిరోడ్డు,బైపాస్ రోడ్డు, గొల్లపల్లి ప్రాంతాలకు రద్దీ ఏర్పడింది. భక్తుల కోసం ప్రత్యేక క్యూ ఏర్పాటు చేశారు. అమ్మవారిని అర్చకులు సేతుస్వామి ప్రత్యంగిరి అలంకరణలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు అమ్మవారిని దీలు, బోనాలు సమర్పించారు. ఆలయం ఎదుట నిమ్మకాయలతో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. తొగటవీరక్షత్రియులు జ్యోతులను తయారు చేసి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారిని ప్రత్యేక వాహనంలో పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పు రామచంద్ర, బండి నాగరాజ, ప్రభాకర్, లోకేష్, పురం రమణ తదితరులు పాల్గొన్నారు. టుటౌన్ సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ చంద్రమోహన్ బందోబస్తు నిర్వహించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె : ఐసీడీఎస్ ప్రాజెక్ట్ మదనపల్లె పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ ఖాళీలకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ సుజాత తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వారు ఈ మేరకు బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. నిమ్మనపల్లె మండలం దేవళంకురవపల్లె(బీసీ–బి), మదనపల్లె మండలంలోని నీరుగట్టిపల్లెరోడ్(ఓసీ), పాతకూరాకులపల్లె(ఓసీ), మున్సిపల్ వర్కర్స్‌కాలనీ(ఓసీ), గుడిసివారిపల్లె(ఎస్సీ)లలో మొత్తం 5 అంగన్‌వాడీ వర్కర్స్ ఖాళీలు, డి.కే.పల్లె పార్క్(ఓసీ), గొల్లపల్లెరింగ్‌రోడ్డు(ఓసీ), చాకలిమిట్ట(ఓసీ), మంజునాథకాలనీ(బీసీ–బి), రంగారెడ్డికాలనీ(బీసీ–ఏ), రైల్వేక్రాస్‌రోడ్(ఓసీ), గొల్లపల్లె(ఎస్సీ), నల్లగుట్టపల్లె(బీసీ–ఏ), నిమ్మనపల్లె మండలం కొమ్మిరెడ్డిగారిపల్లె(ఓసీ), బి.కొత్తకోట మండలం గుడిపల్లి(ఈడబ్ల్యూఎస్) మొత్తం 10 అంగన్‌వాడీ హెల్పర్ ఖాళీలు ఉన్నాయన్నారు. వీటికి దరఖాస్తు చేసుకునే మహిళలు 35 సంవత్సరాల వయస్సు మించి ఉండరాదని, పదోతరగతి ఉత్తీర్ణులై వివాహితులై, స్థానికంగా నివాసం కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులను ఈనెల 27వతేదీ సాయంత్రం 5 గంటలలోపు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ మదనపల్లె కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయ పనివేళల్లో సంప్రదించవచ్చన్నారు.

దరఖాస్తు చేసుకోండి

తంబళ్లపల్లె: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఒక అంగన్‌వాడీకార్యకర్త, 18 హెల్పర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో నాగవేణి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. తంబళ్లపల్లె మండలంలో మర్రిమాకులపల్లె అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు– ఓసీలకు కేటాయించారు. హెల్పర్ పోస్టులు మండ్యంవారిపల్లె బీసీ–బీ, తంబళ్లపల్లె–3(కె.రామిగానిపల్లె బీసీఏ), పెద్దమండ్యం మండలం తుమ్మావారిపల్లే ఎస్సీ, కుమ్మరపల్లె , గుడిసివారిపల్లె బీసీ–డీ, మండలవారిపల్లె ఎస్టీ, అభ్యర్థులకు, ములకలచెరువు మండలం హెల్పర్ పోస్టులు వేపూరికోట ఈడబ్ల్యూఎస్, ములకలచెరువు–2 బీసీ–బీ, కోటపల్లె ఎస్టీలకు, పెద్దతిప్పసముద్రం మండలం చెన్నరాయునిపల్లె బీసీ–ఈ, పోతుపేట ఎస్సీ, పెద్దతిప్పసముద్రం–1 బీసీ–ఏ, కొటాలవాండ్లపల్లె, గుగ్గిళ్లపల్లె, బూర్లపల్లె–2 బీసీ–బీ, నారాయణపల్లె, పెద్దకొండ ఎస్సీ అభ్యర్థులకు కేటాయించినట్లు తెలిపారు.

ఘనంగా బోయకొండ గంగమ్మ తిరునాల


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : మండలంలోని ముడుపులవేముల పంచాయతీ రాయలవారిపల్లె సమీపంలో వెలసిన శ్రీ బోయకొండ గంగమ్మ తిరునాల బుధవారం ప్రారంభమైంది. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అలంకరణ, పూజలు నిర్వహించారు. రాత్రికి చెక్కభజనలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం అమ్మవారి ఊరేగింపు, పొంగళ్లు, దీలు, బోణాలు ఉంటాయని నిర్వాహకులు అన్నపూర్ణ క్యాటరింగ్ అధినేత ఆర్.కె. చలపతి తెలిపారు. భక్తులకు రెండు రోజుల పాటు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. అర్చకులు కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పూజలు చేశారు. సర్పంచ్ రాజేష్, ఎంపీటీసీ చెంగల్‌రాయుడు పాల్గొన్నారు.

మరసంను కొత్త ఒరవడితో ముందుకు తీసుకెళ్తాం


ఉగాది కవితలు వినిపిస్తున్న కవయిత్రి


హాజరైన సాహితీ అభిమానులు

ఘనంగా మరసం రజతోత్సవ వేడుకలు

మదనపల్లె సిటీ: మదనపల్లె రచయితల సంఘం (మరసం)ను కొత్త ఒరవడితో ముందుకు తీసుకెళ్తామని మరసం అధ్యక్షులు ప్రసాద్ అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక బొంతలవారి కళ్యాణ మండపంలో మరసం రజతోత్సవ వేడకలు ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 25 సంవత్సరాల్లో ఎంతో మంది రచయితలు తోడ్పాటు అందించారన్నారు. అనేక మంది రచనలు ఆవిష్కరించడం జరిగిందన్నారు. మరసంను అందరి రచయితలు, కవుల సహకారంతో మరింత అభివృద్ధివైపు తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పురాణం త్యాగమూర్తిశర్మ, కార్యదర్శి లింగాల యుగంధరాచారి, పర్యవేక్షకులు ఖిజర్‌ఖాన్, అధ్యాపకురాలు మోహన్‌వల్లి, లైబ్రేరియన్ వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కవితలు

ఉగాది పురస్కరించుకుని పలువురు కవితలను చదివి వినిపించారు. ఉగాది విశిష్టత, తెలుగు భాషల గురించి కవితల రూపంతో చెప్పారు. అలాగే గజల్స్ వినిపించారు. చిన్నారి హేవితశ్రీ నృత్యప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. బలరాముడు ఏకపాత్రాభినయం అలరించింది.

ఉగాది వేడుకలలో పాల్గొన్న ప్రభుత్వ విప్

రైల్వేకోడూరు : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు లోగిళ్ళలో శోభకృత్ నామ సంవత్సర కొత్త వెలుగులు నింపాలని ప్రార్థిస్తున్నామన్నారు.